ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
గురువారం 23 మే 2024





- ఓట్ల చీలికతో ఎంపీ సీటు ఏమవుతుందో అంటూ ఆందోళన
- పోలింగ్ తరువాత బూతుల వారీగా వివరాల సేకరణ
- పులివెందుల, కడప, ప్రొద్దుటూరులో క్రాస్ ఓటింగ్ కలవరం

వైసీపీలో షర్మిల భయం

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెలువడనున్నాయి. ఇప్పటికే టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ నేతలు బూత్‌ల వారీగా పోలింగ్ సమాచారాన్ని సేకరించి అంచనాలు వేస్తున్నారు. పోలింగ్ జరిగి నేటికి పది రోజులు కావస్తోంది. ఇంకా పార్టీ అభ్యర్థుల్లో టెన్షన్ తగ్గలేదు. రకరకాల మార్గాల్లో ఓటింగ్ సరళిని అంచనా వేస్తున్నారు. అయితే జిల్లాలో మాత్రం వైసీపీకి వైఎస్ షర్మిల భయం పట్టుకుంది. ఎక్కడ ఎంపీ సీటుకు ఎసరు పెడుతుందోనని కలవరం మొదలైందంటున్నారు.

(కడప-ఆంధ్రజ్యోతి): పోలింగ్ తరువాత షర్మిలాకు క్రాస్ ఓటింగ్ జరిగినట్లు పోలీసులు అంచనాకు వచ్చినట్లు చెబుతున్నారు. ఇదే ఇప్పుడు ఎక్కడ కొంప ముంచుతుందోనన్న భయం వేసీపీ నేతలను వేధిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా కడప, ప్రొద్దుటూరు, పులివెందులలో షర్మిలాకు క్రాస్ ఓటింగ్ జరిగినట్లు చెబుతున్నారు. పార్లమెంటు పరిధిలో టీడీపీ నుంచి చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డి, వైసీపీ నుంచి సిట్టింగ్ ఎంపీ అవినాశ్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి జగన్ సోదరి షర్మిల బరిలో ఉన్నారు. పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన తక్కువ సమయంలోనే కాంగ్రెస్ పార్టీ షర్మిలాను కడప నుంచి బరిలోకి దింపింది. జిల్లాలో రెండుసార్లు ఆమె బస్సుయాత్ర చేశారు. షర్మిలాకు తోడుగా డాక్టర్ సునీత, వివేకా సతీమణి సౌభాగ్యమ్మ సైతం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రచారం చివరి రోజైన మే11వ తేదీన కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధి కడప బహిరంగసభలో పాల్గొనడంతో కాంగ్రెస్‌లో మంచి ఊపు వచ్చింది.

ఎంపీ సీటు ఏమవుతుందో..?

పీసీసీ చీఫ్‌గా వైఎస్ షర్మిల బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి జగన్ వైఫల్యాలను ప్రశ్నించడంతో పాటు వివేకా హత్య గురించి ప్రస్తావిస్తున్నారు. ఇక కడప పార్లమెంటు బరిలో దిగిన తరువాత ఆమె ఏకంగా సీఎం జగన్, ఎంపీ అవినాశ్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. వివేకాను చంపిన హంతకులను జగన్ వెనకేసుకు వస్తున్నారని ఒక మాజీ సీఎం తమ్ముడు, ఒక సీఎం చిన్నాన్నను చంపిన వారికి శిక్ష పడకుంటే ఇక సామాన్యులకు ఏ న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. హంతకుడు చట్టసభలకు వెళ్లకూడదనే తాను బరిలో దిగినట్లు షర్మిల ప్రచారంలో ప్రజలకు తెలిపారు. షర్మిలా ధాటికి జగన్ శిబిరం ఉక్కిరిబిక్కిరి అయిందని చెబుతారు. జిల్లాలో వివేకాకు అనుచరులు ఉన్నారు. వీరితో పాటు సామాన్య జనం సైతం రాజశేఖర్‌రెడ్డి బిడ్డగా షర్మిలను ఆదరించారేమోనని వైసీపీలో ఆందోళన చెందుతున్నట్లు చెబుతున్నారు.

క్రాస్ ఓటింగ్

షర్మిలాకు క్రాస్ ఓటింగ్ జరిగినట్లు రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. జిల్లాలోనే కాదు ఇతర ప్రాంతాల వారు కూడా కడప ఫలితంపైనే దృష్టి పెట్టారు. దీంతో బెట్టింగ్‌రాయుళ్లు, ఇతర సర్వే సంస్థలు పోస్టుపోల్ నిర్వహించగా క్రాసింగ్ జరిగినట్లు అంచనాకు వచ్చినట్లు చెబుతున్నారు. ముస్లిం మైనార్టీలు, క్రిస్టియన్లు కాంగ్రెస్‌కు సంప్రదాయ ఓట్లు. గత రెండు పర్యాయాలు వీరు వైసీపీ వెంట నడిచారు. అయితే ఆ వర్గానికి చెందిన వారు ఇప్పుడు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపినట్లు చెబుతున్నారు. కడపలో మైనార్టీ, క్రిస్టియన్ వర్గాల ఓటు బ్యాంకు గణనీయంగా ఉంది. అలాగే ప్రొద్దుటూరు, బద్వేలు, కమలాపురం, మైదుకూరు, జమ్మలమడుగులో కూడా వీరి ఓట్లు ఎక్కువే ఉన్నాయి. దివంగత వైఎస్ కూతురు షర్మిల పోటీకి దిగడంతో ఆ వర్గాల్లో ఓట్లు ఈసారి కాంగ్రెస్‌కు మళ్లినట్లు అంచనా వేస్తున్నారు. ఇక పులివెందులలో అయితే క్రాస్ ఓటింగ్ జరిగినట్లు వైసీపీ కూడా ఒక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో షర్మిల ఎక్కడ కొంప ముంచుతుందో అనే భయం వైసీపీని కలవరపాటుకు గురి చేస్తున్నట్లు చెబుతున్నారు. పులివెందులలో కొన్ని చోట్ల కాంగ్రెస్ కూడా డబ్బులు పంపిణీ చేసిందని సమాచారం. దీంతో ఎక్కడ ఎంపీ స్థానానికి దెబ్బకొడుతుందోనని వైసీపీ శ్రేణులు ఆందోళనకు గురవుతున్నాయని ప్రచారం సాగుతోంది. ఇది ఎంత వరకు వాస్తవమో తేలాలంటే మరో 12 రోజులు ఆగాల్సిందే.



కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- తొలి ఫలితం కమలాపురానిదే..

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు సమయం దగ్గరపడుతుండడంతో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. కడప శివారులో రిమ్స్ సమీపంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్శిటీలో ఈవీయంలు, పోస్టల్ బ్యాలెట్‌లు స్ట్రాంగ్‌రూములో భద్రపరిచారు. జూన్ 4న ఉదయం 8గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఈవీయంలకు 14 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్‌కు 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఓటింగ్ నమోదు బట్టి కౌంటింగ్ రౌండ్లను ఏర్పాటు చేశారు. కమలాపురం నియోజకవర్గంలో 251 పోలింగ్ స్టేషన్లకు గాను 18 రూములు ఏర్పాటు చేశారు. కమలాపురంలో మొత్తం ఓట్లు 2,04,169 ఓట్లు ఉంటే 1,72,401 ఓట్లు పోల్ అయ్యాయి. 18 రౌండ్లు ఉండడంతో తొలి ఫలితం కమలాపురందే ఉంటుంది. బద్వేలు నియోజకవర్గంలో 272 పోలింగ్ స్టేషన్లకు గాను 20 రౌండ్లు, కడప నియోజకవర్గంలో 287 పోలింగ్ స్టేషన్లకు గాను 21 రౌండ్లు, పులివెందులకు 301 పోలింగ్ స్టేషన్లకు గాను 22 రౌండ్లు, జమ్మలమడుగులో 315 పోలింగ్ స్టేషన్లకు గాను 23 రౌండ్లు, ప్రొద్దుటూరులో 268 పోలింగ్ స్టేషన్లకు 22 రౌండ్లను ఏర్పాటు చేశారు. అలాగే మైదుకూరు నియోజకవర్గంలో 269 పోలింగ్ స్టేషన్లకుగాను 20 రౌండ్లను ఏర్పాటు చేస్తున్నారు. అభ్యర్థుల వెంట కౌంటింగ్ హాలులోకి ఏజెంటు లేదా అభ్యర్థికి అనుమతి ఉంటుంది.

ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు

కడప (క్రైం), మే 22 : ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు అన్నారు. బుధవారం కడప, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య జిల్లాల ఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ టీం వర్క్‌తో బాగా పనిచేయాలన్నారు. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు సందర్భంగా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా ఉంచాలన్నారు. కమాండ్ కంట్రోల్ నుంచి పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద నిర్ణీత దూరంలో అందరూ ఉండే విధంగా చూడాలన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద కేవలం ఏజంట్లు, అభ్యర్థులు మాత్రమే ఉండాలన్నారు. పెట్రోలును బాటళ్లలో, క్యాన్‌లలో అమ్మకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాణసంచా నిల్వలు లేకుండా చూడాలన్నారు. ఈనెల 30 నుంచి ప్రతిజిల్లా సరిహద్దు ప్రవేశం, నిష్క్రమణల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ట్రబుల్ మాంగర్స్‌ను బైండోవర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా ఎస్పీ క్రిష్ణకాంత్, నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా ఎస్పీ బి.క్రిష్ణారావు, కడప జిల్లా అదనపు ఎస్పీ సుధాకర్, డీఎస్పీలు పాల్గొన్నారు.

పెన్నాలో ఇసుక తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవు

- కదలిన రెవెన్యూ యంత్రాంగం

ప్రొద్దుటూరు, మే 22: ప్రొద్దుటూరు మండల పరిధిలో పెన్నానదిలో ఎక్కడా ఇసుక తవ్వకాలకు అనుమతి లేదని నిబంధనలు ఉల్లంఘించి ఇసుక తవ్వకాలు జరిపితే కఠిన చర్యలుంటాయని తహశీల్దారు విద్యాసాగర్ హెచ్చరించారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'ఆగని ఇసుక దందా' కథనంపై రెవెన్యూ యంత్రాంగం స్పందించింది. తహశీల్దారు విద్యాసాగర్ ఆధ్వర్యంలో డిప్యూటి తహశీల్దారు సుదర్శన్ వీఆర్వోలు కలిసి పెన్నానదిలో ఇసుక అక్రమ తవ్వకాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముక్తియార్ ఆయిల్‌మిల్లు ఏరియాలో నదిలో ఇసుక లోడ్ చేస్తున్న వారు రెవెన్యూ సిబ్బంది రాకతో ఇసుక అన్‌లోడ్ చేసి ట్రాక్టర్‌తో పరార్ అయ్యారని తహశీల్దారు తెలిపారు. అలాగే ఆర్టీపీపీ రోడ్డు మార్గంలో రామేశ్వరం హెడ్ వాటర్ వర్క్స్ వద్ద రెవెన్యూ సిబ్బంది వెళ్లి పరిశీలించారు. ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో ఇసుకాసురులు ప్రధాన ప్రాంతాల్లో ఇసుక రవాణాకు తాత్కాలికంగా ఒకరోజు బ్రేక్ వేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు

పెన్నానదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు నియంత్రించడానికి పోలీసు రెవెన్యూ మైనింగ్ ఎస్ ఈబీ అధికారులతో పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తహశీల్దారు విద్యాసాగర్ తెలిపారు. అంతేకాకుండా వీఆర్వోలతో ప్రత్యేక పర్యవేక్షణ టీంలు వేసి నదిలో అక్రమ తవ్వకాలు జరపకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



పెన్నానదిలో ఇసుక తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహశీల్దారు విద్యాసాగర్, రెవెన్యూ సిబ్బంది

ఓట్ల లెక్కింపునకు పటిష్ట చర్యలు

- 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు



కడప(కలెక్టరేట్), మే 22: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపును సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామజు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటిం గ్ హాలులో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపుపై జిల్లా ఎలక్షన్ కంట్రోల్ రూమ్ ప్రత్యేక పర్యవేక్షకులు, నగర కమిషనర్ ప్రవీణ్ చంద్‌తో కలసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు జూన్ 4వతేదీ ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం అవుతుం దన్నారు. ఓట్ల లెక్కింపు పారదర్శకంగా, పటిష్టంగా, శాంతియుతంగా నిర్వహించేందు కు అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టామన్నారు. కడప రిమ్స్ సమీపంలోని మౌలానా అబుల్ కలాం అజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూము ల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో పాటు, పోలింగ్ కేంద్రాల్లో పోలైన ఓట్లతో నిక్షిప్తమైన ఈవీఎంలను అత్యంత సురక్షితంగా భద్రపరిచామన్నారు. మొత్తం 112 సీసీ కెమెరాల నిఘాలో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఈనెల 25వ తేదీన ఓట్ల లెక్కింపులో పాల్గొనే సిబ్బందికి మొదటి ర్యాండమైజేషన్, జూన్ 2న రెండవ ర్యాండమైజేషన్, 4వ తేదీ ఉదయం 5 గంటలకు 3 వ ర్యాండమైజేషన్ పూర్తి చేస్తామన్నారు. ఈ ప్రక్రియ మొత్తం ఎన్నికల సాధారణ, కౌంటింగ్ పరిశీలకులు, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో జరుగుతుందన్నారు. జూన్ 4వ తేదీన ఉదయం 8గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరుగుతుందని, ఏజెంట్లు ఉదయం 7 గంటలలోగా కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. కౌంటింగ్ హాలులోకి అభ్యర్థి లేదా, కౌంటింగ్ ఏజెంట్ ఒక్కరికి మాత్రమే అనుమతి ఉంటుందని, ఇతర ఏ ప్రజాప్రతినిధులకు అనుమతి లేదన్నారు.

ఎన్నికల ఫలితాలపై.. ఆన్‌లైన్ బెట్టింగ్..!

- ప్లేస్టోరులో ఆల్ కిలాడీ యాప్ రెడీ
- రూ.2వేల నుంచి రూ.లక్షల్లో బెట్టింగ్



పందెంరాయుళ్లు అవకాశం ఉన్న ప్రతిదానిపైనా పందేలు కాస్తున్నారు. ఇన్నాళ్లు క్రికెట్ బెట్టింగ్ చూశాం. ఇప్పుడు సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై బెట్టింగులు కడుతున్నారు. అది కూడా ఆన్‌లైన్ బెట్టింగ్ కావడం విశేషం. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఆండ్రాయిడ్ మొబైల్ వాడుతున్నారు. ఇదే బెట్టింగ్‌రాయుళ్లకు కలిసివస్తోంది. ప్లేస్టోరులో ఆల్ కిలాడీ.. మరికొన్ని యాప్‌లు రెడీగా ఉండడంతో వీరు వాటిని డౌన్‌లోడ్ చేసుకుని పందెం కాస్తున్నారు.

కడప (క్రైం), మే 22: బెట్టింగ్.. ప్రస్తుతం పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా 18 నుంచి 40 ఏళ్లలోపు వారిని విపరీతంగా ఆకర్షిస్తున్న జాడ్యం ఇది. చెమటోడ్చి సంపాదించడానికి మొగ్గు చూపని యువత ఇలాంటి వ్యాపకాలతో కోటీశ్వరులు కావాలని కలలు కంటున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే కోరికతో స్నేహితుల ద్వారా ఆన్‌లైన్ ప్రకటనల ప్రలోభాలతో ఈ ఉచ్చులోకి దిగుతున్నారు. జూదం నిర్వాహకులు మొన్నటి ప్రపంచ కప్ క్రికెట్ పోటీలు, ఇటీవల జరగిన ఏపీ అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికల ఫలితాలను పందాలకు వేదికగా మలుచుకోవడం గమనార్హం.

ఉమ్మడి కడప జిల్లాల్లో పది అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు పార్లమెంటు స్థానాలు ఉన్నాయి. ప్రధాన పార్టీలైన టీడీపీ కూటమి, వైసీపీ అభ్యర్థులు పోటాపోటీగా తలపడ్డారు. పోలింగ్ ముగిసింది. ఇప్పుడు ఎవరు గెలుస్తారనే దానిపై ఆన్‌లైన్ బెట్టింగ్‌లు జోరందుకున్నాయి. కొంత మంది ఆన్‌లైన్‌లో రూ.2వేల నుంచి లక్షల్లో బెట్టింగ్‌లో పాల్గొంటున్నారు. జూన్ 4న ఎన్నికల ఫలితాలు విడుదల కానున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే టీ బంకుల వద్ద ఆటోస్టాండ్ల వద్ద ఎక్కడైనా స్నేహితుల మధ్య కూర్చుంటే ఒకరికొకరు ఈ యాప్‌ల గురించి ప్రచారాలు చేసుకుంటూ బెట్టింగులు కాస్తున్నారు. ఏ అభ్యర్థి గెలుస్తాడు, ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది అంటూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జోరుగా బెట్టింగ్‌లు కాసినట్లు సమాచారం. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచన ఉన్న వారికి ఆన్‌లైన్ బెట్టింగ్, సైబర్ నేరగాళ్లు ఎరవేస్తున్నారు. తొలుత కొంత లాభం ఆశ చూపి ఆ తరువాత కదలకుండా ఉచ్చు బిగించి అందిన కాడకి దోచేస్తున్నారు. వీరి బారిన పడి అన్ని వర్గాల వారూ తరచూ ఎవరో ఒకరు మోసపోతూనే ఉన్నారు.

సై అంటే సై

- పోరుమామిళ్ల సర్కిల్‌లో ఊపందుకున్న పందేలజోరు
- రూ.10 కోట్లు దాటిన బెట్టింగ్‌లు

పోరుమామిళ్ల, మే 22: సార్వత్రిక ఎన్నికలు అయిపోయాయి. నాయకుల్లో కొందరు పుణ్యక్షేత్రాల చుట్టూ తిరుగుతూ.. మరికొందరు విదేశాలకు వెళ్లి గడుపుతున్నారు. జూన్ 4న వచ్చే ఫలితాల అంచనాపై ఇరుపార్టీల నాయకులలో ఉత్కంఠ నెలకొంది. జూన్ 2వ తేదీ వరకు ఏ సంస్థ కూడా సర్వేలు ప్రకటించరాదని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. అయితే ఈలోపు పందేలు సై అంటే సై అనేరీతిలో సాగుతున్నాయి. పోరుమామిళ్ల సర్కిల్ పరిధిలో పందెం రాయుళ్లు ఎక్కువయ్యారు. ఇక్కడే దాదాపు రూ.10 కోట్లకు పైగా బెట్టింగ్‌లు సాగాయని అంటున్నారు.

పోరుమామిళ్ల నుంచి ప్రొద్దుటూరు, విజయవాడ, బద్వేలు, జమ్మలమడుగుతో పాటు దూరప్రాంతాల్లో కూడా బెట్టింగ్‌లు పెట్టారని ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది, బద్వేలు నియోజకవర్గంలో ఏ అభ్యర్థి విజయం సాధిస్తారన్న అంశంపై పందేలు ఊపందుకుంటున్నాయి. రోజురోజుకూ ఈ బెట్టింగ్‌లు కాసేవారు ఎక్కువ కావడంతో మధ్యవర్తిత్వం చేసేవారికి గిరాకీ ఏర్పడింది. బెట్టింగ్ పెట్టిన మొత్తంలో 5 శాతం మధ్యవర్తికి చెందేటట్లు ఒప్పందాలు చేసుకుని అగ్రిమెంట్లు కూడా రాయించుకుంటున్నారు. కొందరు గుట్టుగా పందెం కాసేందుకు ఇతరుల వద్దకు మధ్యవర్తులను పురమాయిస్తున్నారు. లక్షకు లక్షన్నర ఇస్తాం, మా పార్టీ అధికారంలోకి వస్తుందని అధికార పారికి చెందిన నాయకులు కొందరు సవాలు విసురుతున్నారు. అయితే ఎన్నికల్లో వైసీపీకి ఓటువేసిన వారు సైతం రాష్ట్రంలో టీడీపీ వస్తుందని పెద్దమొత్తంలో పందెం కాశారనే పోరుమామిళ్లలో ప్రచారం జరుగుతోంది.

ఎన్నికల వరకు పోటాపోటీగా ప్రచారం చేసుకుని ఓట్లు వేయించుకున్న నాయకులు కూడా బెట్టింగ్‌ల విషయానికి వస్తే పరస్పరం ఫోన్ల ద్వారా మాట్లాడుకోవడం, లేదా మధ్యవర్తుల ద్వారా లావాదేవీలు జరుపుతున్నారు. బద్వేలు నియోజకవర్గంలో అతి తక్కువ మెజార్టీతో అయినా రోశన్న విజయం సాధిస్తాడని పందేలు కట్టిన వారు కూడా ఉన్నారు. ఈ నాలుగు మండలాల్లో తమ పార్టీకి ఎంత మెజార్టీ వస్తుందనే దానిపై కూడా పందేలు కట్టారని అంటున్నారు. కొందరైతే దూర ప్రాంతాలకు పోలింగ్‌కు వెళ్లిన ఉద్యోగస్తులను పిలిపించుకుని ఏ జోన్‌లో ఏ పార్టీకి ఎంత మెజార్టీ వస్తుంది, ఉద్యోగస్తులంతా ఏ వైపు ఉన్నారని ఆరా తీస్తున్నారు. చివరికి అన్నదమ్ములు కూడా పందేలు పెట్టుకోవడానికి వెనుకాడడంలేదు. ఈ పరిస్థితుల్లో అధికార పార్టీలోని నాయకుల్లో టెన్షన్ మొదలైంది. ఇప్పటికే ఒక్క పోరుమామిళ్ల సర్కిల్ పరిధిలోనే రూ.10కోట్లకు పైగా పందేలు కాశారనే ప్రచారం సాగుతోంది. కౌంటింగ్ రోజు దగ్గరపడేకొద్దీ ఇంకా ఎన్ని కోట్ల రూపాయలు పందేలు కాస్తారో వేచి చూడాల్సిందే.


భలే అల్లరోడే.. మహాపండితుడాయె

'చందమామ రావే.. జాబిల్లి రావే..' అమ్మగొంతులోంచి ఈ చల్లని పాట వింటూ గోరుముద్దలు తిని పెరగని వారెవరైనా తెలుగు నేలమీద ఉంటారా..
'జో అచ్యుతానంద.. జో జో ముకుందా.. లాలి పరమానంద.. రామగోవిందా..' అమ్మపాడే ఈ కమ్మని జోలపాట వింటూ హాయిగా నిద్రపోని బాల్యాన్ని ఊహించగలమా.
'అదివో అల్లదివో శ్రీ హరివాసము.. పదివేల శేషుల పడగలమయము' అంటూ వేంకటేశ్వరుని స్తుతించని తెలుగువారుండరు అంటే అతిశయోక్తి కాదేమో..
ఇలాంటి వేలాది సంకీర్తనలు ఏడుకొండల వాడిపై రచించి వేంకటేశ్వరుని మహిమలను, ఏడుకొండల ఔన్నత్యాన్ని, తిరుమల విశేషాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యులు. నేటి నుంచి తాళ్లపాకలో అన్నమయ్య జయంతి ఉత్సవాలు జరుగుతున్న సందర్భంగా ప్రత్యేక కథనం..



తిరుమల శ్రీవారి ఆలయంలో ఉన్న అన్నమయ్య సంకీర్తనాభాండాగారపు గది

- మానవతావాది.. బహుముఖ ప్రజ్ఞాశాలి
- సాంఘిక దురాచారాలపై సంకీర్తనలతో ధ్వజమెత్తిన అన్నమయ్య
- 32వేల కీర్తనలను రచించిన తొలి సంకీర్తనాచార్యులు తాళ్లపాక అన్నమాచార్యులు
- నేటి నుంచి జయంతి మహోత్సవాలు



తాళ్లపాక ముఖద్వారం వద్ద అన్నమయ్య 108 అడుగుల విగ్రహం

రాజంపేట, మే 22: తెలుగు రాష్ట్రాల్లో అన్నమయ్య గురించి తెలియని వారుండరు. తొలి పదకవితా పితామహునిగా వాసికెక్కిన అన్నమయ్య చరిత్రపుటల్లో తెలుగు జాతి ఉన్నంత వరకు కీర్తింపబడుతూనే ఉంటారు. ఆయన సంకీర్తనాగానాన్ని ఎవ్వరూ మర్చిపోలేరు. అందువల్లే జిల్లాల విభజన సమయంలో ఆయన కీర్తి చిరస్థాయిగా నిలిచిపోయేటట్లు రాజంపేట పార్లమెంటును జిల్లాను చేస్తూ అన్నమయ్య జిల్లా అని నామకరణం చేశారు. ప్రస్తుతం తాళ్లపాక అన్నమాచార్యుల 616వ జయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి. 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు తాళ్లపాక, 108 అడుగుల విగ్రహం వద్ద ఈ ఉత్సవాలు జరగనున్నాయి.

అన్నమయ్య చిన్నప్పుడు మహా అల్లరి పిల్లవాడట. ఎప్పుడూ ఆటలూ, పాటలే. ఇంట్లో ఎవరికీ అది నచ్చేది కాదు. వదిన మందలింపులు ఎక్కువ. ఒకసారి అన్నమయ్యను గడ్డికోసుకు రమ్మని అడవికి పంపింది. వదినను తిట్టుకుంటూ అడవికి వెళ్లాడు. గడ్డి కోస్తుండగా చిటికిన వేలు తెగింది. రక్తం ధారలై కారింది. వదిన ఇష్టం లేని చెప్పిందన్న కోపం... గాయం సలుపుతున్న బాధ.. అదే సమయంలో గోవిందనామస్మరణలు ఆ అడవిలో అన్నమయ్యకు వినిపించాయి. తిరుమలకు కాలినడకన వెళ్తున్న భక్తబృందాలు కనిపించాయి. ఏడుస్తున్న బాలుడిని వారు ఓదార్చి తెచ్చుకున్న తిండిని బాలుడికి పెట్టారు. ఇంటిమీద కోపంతో ఉన్న అన్నమయ్య తిరుమలకు బయల్దేరాడు. అదే అతని తిరుమల మొదటియాత్ర.

నాటి సాంఘిక దురాచారాలపై తిరుగుబాటు

అన్నమయ్య సంకీర్తనల్లో ఎన్నో ఉన్నత భావాలు, సమానత్వపు భావాలు కనిపిస్తాయి. శివుడే దైవమని వీరశైవులు, విష్ణువే దేవుడని వీరవైష్ణవులు విషం కక్కుకుంటున్న పరిస్థితిల్లో బ్రహ్మం ఒక్కడే.. పరబ్రహ్మం ఒక్కడే అంటూ ప్రజల భావనల్లో ఏకత్వాన్ని నింపాలని ప్రయత్నించాడు. మెండైన బ్రాహ్మణుడు మెట్టుభూమి ఒక్కటే.. చండాలుండేటి సరిభూమి ఒక్కటే.. అని కులవివక్ష తగదని ప్రబోధించాడు. వేదాలు పఠించిన వారు గొప్పవారు కాదని, ఆచరించిన వారే ఉన్నతులని పేర్కొన్నారు. భూమిని దళితుడూ తాకుతున్నాడు బ్రాహ్మణుడూ తాకుతున్నాడు... భూమికి ఈ తేడా లేనప్పుడు మానవులకు కులమతాల తేడా ఎందుకని తన పదకవితల ద్వారా కులమతాలకు వ్యతిరేకంగా పదునుపెట్టాడు. భగవంతునికి సర్వం సమానమని చాటాడు. తన కీర్తనల్లో ఆనాటి జానపదాలను పొందుపరిచారు. సువ్వి పాటలు, నేరెళ్లు, గొబ్బి పాటలు, సోది, జాన పదాలు అన్నమయ్య కీర్తనల్లో కనిపిస్తాయి.

శ్రీవారి ఆలయంలో హుండీ పెట్టింది అన్నమయ్యే

నేడు వేలకోట్ల రూపాయలు శ్రీవారికి కానుకలు వచ్చే అత్యంత ప్రధాన ఆదాయ వనరు హుండీ. దానిని తిరుమలలో పెట్టింది అన్నమయ్యే. అన్నమాచార్యులు అలనాడు శ్రీవారి ఆలయంలో పెట్టిన హుండీ ద్వారా నేడు ఏడాదికి కనీసం వెయ్యికోట్లు వస్తోంది.

సాహితీ సంపన్నులు అన్నమయ్య వంశీయులు

ఆబాల గోపాలాన్ని తన కీర్తనలతో అలరించిన అన్నమయ్య చరిత్రలోనే గొప్ప పండితుడు. తొలితెలుగు వాగ్గేయకారుడు. ఆయనతో పాటు ఆయన వారసులందరూ సాహితీ సంపన్నులే. అన్నమాచార్యుల మొదటి భార్య తిమ్మక్క సరస్వతీ మూర్తి. ఈమెను తిరమలాంబ అనేవారు. ఆమె సుభద్ర కల్యాణాన్ని రచించారు. అన్నమాచార్యుల రెండో భార్య అక్కమాంబ. ఆమె కుమారుడు తాళ్లపాక పెద్ద తిరుమలాచార్యులు శృంగారవృత్తశతకం, చక్రవాక మంజిరి రచించారు. తండ్రి అన్నమయ్య కీర్తనలను రాగిరేకులపై లిఖింపజేసి భద్రపరచడంలో ఈయన కృషి ప్రశంసనీయం. ఈయన వేల కొలది కీర్తనలు రాసారు. అనేక శతక, రగడలు, సప్తమాలు, దండకాలు రచించాడు. అన్నమయ్య, తిరుమలాంబ కుమారుడు తాళ్లపాక నరసింగన్న. ఇతనిని నరసయ్య, నరసింహాచార్యులు అని పిలిచేవారు. ఈయన రచనలు వెలుగులోకి రాకపోయినా ఈయన ప్రతిభను గురించి తెనాలి రామకృష్ణుడు తనకవిత్వంలో అనేక చోట్ల ప్రస్తుతించారు. అన్నమాచార్యుల మనుమడు తిరుమలయ్య సంగీత సాహిత్యాలలో ఆరితేరినవాడు. ఆధ్యాత్మిక, శృంగార కీర్తనలు అనేకం రచించాడు. తాళ్లపాక తిరువెంగళనాథుడు అన్నమాచార్యుల నాల్గవ కుమారుని బిడ్డ. ఈయనను చిన్నప్ప అని పిలిచేవారు. ఈయన అన్నమచార్య చరిత్ర, అష్టమంజరికల్యాణం, పరమయోగి విలాపం, ఆశాపరిణయం అనే కావ్యాలు రచించారు. తాళ్లపాక చిన్నతిరుమలయ్య కుమారుడు తిరువెంగళప్ప వ్యాఖ్యలు రాయడంలో పేరుగడించారు.

తాళ్లపాకలో ఒక్కరూ లేరు

వేంకటేశ్వరస్వామి కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన తాళ్లపాక అన్నమాచార్యుల వంశం వారిలో ప్రస్తుతం తాళ్లపాకలో ఒక్క కుటుంబం కూడా లేదు. ఆ వంశానికి చెందిన ఒక్క పూరి పాకకూడా లేదు. కేవలం వారి ఇంటి పునాదుల వద్ద అన్నమయ్య విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. గ్రామంలో ఎటువంటి జీవనభృతి లేకపోవడంతో ఆ వంశానికి చెందిన 11వ తరం వారంతా తిరుమలకు వెళ్లిపోయారు. వారికి తిరుమలలో శ్రీవారి ఆలయానికి పక్కనే గతంలో ఓ ఇల్లుండగా, మాడవీధుల ఆధునీకరణలో ఆ ఇంటిని కూడా తొలగించి వేశారు. ప్రస్తుతం ఆ కుటుంబీకులు ఒక్కరంటే ఒక్కరూ తాళ్లపాక పరిసర ప్రాంతాలలో లేరు. చెట్టుకొకరు, పుట్టకొకరుగా చెల్లాచెదురైపోయారు. 11వ తరానికి చెందిన ఈ కుటుంబీకులు హరినారాయణాచార్యులు, సత్యనారాయణాచార్యులు ప్రస్తుతం తిరుమలలో ఉంటూ శ్రీవారి మేలుకొల్పు, ఏకాంతసేవలు నిర్వహిస్తున్నారు. 11తరాలుగా శ్రీవారికి అన్నమయ్య కుటుంబం ఈ సేవలు నిర్వహిస్తోంది. రాఘవాచార్యులు న్యాయవాదిగా హైదరాబాద్‌లో ఉన్నారు. ఆ వంశానికి చెందిన మీనా, సులోచన కూడా తిరుమలలో ఉన్నారు. అన్నమయ్య వారసుల్లో సత్యనారాయణాచార్యుల కుమార్తె సంగీతంలో ఎంఏ పూర్తి చేశారు. ఈమె అన్నమాచార్య ప్రాజెక్టులో గాన కళాకారిణిగా ఉన్నారు.

అలనాటి అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక



పులివెందులలో జర్మనీ బృందం


ప్రకృతి వ్యవసాయ పొలాన్ని పరిశీలిస్తున్న జర్మనీ బృందం

పులివెందుల, మే 22: ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను జర్మనీ కేఎఫ్ డబ్ల్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ప్రతినిధి బృందం సభ్యులు బుధవారం పరిశీలించారు. పులివెందుల నియోజకవర్గంలోని తొండూరులో రమేశ్ అనే రైతు శాస్త్రవేత్త పొలాలను పరిశీలించారు. తన వ్యవసాయ క్షేత్రంలో ఒక ఎకరా విస్తీర్ణంలో పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పచ్చిరొట్ట ఎరువులను ఎ-గ్రేడ్, ఏటీఎం నమూనాలను అవలంబిస్తున్నాడు. రైతు సాధికార సంస్థ ఆదేశానుసారం 80 సెంట్ల విస్తీర్ణంలో ఎ-గ్రేడ్, 20 సెంట్ల విస్తీర్ణంలో ఏటీఎం మోడల్స్ వేసి మంచి దిగుబడి సాధిస్తున్నారు. రమేశ్ అనుసరిస్తున్న రెండు నమూనాలను బృంద సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి పంట విధానాలను, పురుగు, తెగుళ్ల నియంత్రణకు అనుసరిస్తున్న పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ఆగ్రో ఎకాలజీ అంతర్జాతీయ స్థాయి పరిశోధన కోసం పులివెందులలో నెలకొల్పిన ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఇన్ ఆగ్రో ఎకాలజీ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ సెంటర్ (ఐజీగార్ల్)లో నాలుగు రోజుల పాటు జరగనున్న వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు జర్మనీ బృందం వచ్చింది. ఇందులో భాగంగా జర్మనీకి చెందిన కేఎఫ్ డబ్ల్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ప్రతినిధి బృందం సభ్యులు ఐరిష్, మాథియాస్, మార్క్, సంగీతలు వ్యవసాయ క్షేత్రాన్ని పరిలించి రైతు అనుసరిస్తున్న పద్ధతులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఐజీగార్ల్‌లో రైతు శాస్త్రవేత్తలు, మెంటార్లతో సమావేశమై అకాడమీలో నిర్వహిస్తున్న కోర్సు విధివిధానాలు, ఫీల్డ్‌లో అనుసరిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శామ్యూల్ ఆనంద్, సీనియర్ సలహాదారులు (ఇంటిగ్రేషన్) మురళీధర్, థిమాటిక్ లీడ్‌లు సుధాకర్, డాక్టర్ విజయ్ సందీప్, ఐజీగార్ల్ ఏఓ శివారెడ్డి, సలహాదారులు డాక్టర్ కేఎస్ వరప్రసాద్ పాల్గొన్నారు.

గుండెపోటుతో గండికోట నిర్వాసితుడు మృతి

కొండాపురం, మే 22 : గండికోట ముంపు పరిహారం కోసం కలెక్టర్‌ను కలిసేందుకు వెళుతూ మార్గమధ్యంలో వల్లపు వెంకట కొండయ్య (58) అనే నిర్వాసితుడు గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు కొండాపురం పట్టణానికి చెందిన పలువురు నిర్వాసితులు ముంపు పరిహారం కోసం కలెక్టర్‌ను కలిసేందుకు బుధవారం కొండాపురం నుంచి రెండు వాహనాలలో కడపకు బయలుదేరారు. ఈ నేపథ్యంలో వారితో పాటు వెళ్లిన కొండయ్య కమలాపురం వెళ్లాక గుండెపోటుకు గురయ్యాడు. దీంతో కమలాపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లేలోపే మృతి చెందినట్లు తోటి నిర్వాసితులు తెలిపారు. కాగా కొండయ్యకు గండికోట పునరావాసం కింద పరిహారం అందలేదు. వైసీపీ ప్రభుత్వం నిర్వాసితులకు పరిహారం విడుదల చేస్తూ జీవో విడుదల చేసినా ఇంతవరకు నిధులు విడుదల చేయలేదు. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో పరిహారం వెంటనే ఇప్పించాలని కోరుతూ కలెక్టర్‌ను కలిసేందుకు వెళుతుండగా ఈ సంఘటన జరిగింది. కొండయ్యకు భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రైలుకింద పడి యువకుడు మృతి

వల్లూరు, మే 22 : కమలాపురం పట్టణం, పాపాఘ్నినది బ్రిడ్జిపై రైలుకింద పడి పెండ్లిమర్రి మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన మల్లిఖార్జున (17) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికులు గమనించి వెంటనే కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్సపొందుతూ క్షతగాత్రుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా మృతుడి తల్లిదండ్రులు కొద్దిరోజుల క్రితమే బలవన్మరణం చెందడంతో మృతుడు వల్లూరు మండలం తప్పెట్ల గ్రామంలో తన బంధువు వద్ద ఆశ్రయం పొందుతున్నట్లు సమాచారం. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు విచారణలో తెలియాల్సి ఉంది.

వైభవంగా భువనగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో నరసింహస్వామి

రాజంపేట, మే 22 : రాజంపేట మండలం భువనగిరిపల్లె లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. రెండు రోజులుగా జరుగుతున్న ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. బుధవారం నరసింహస్వామి జయంతి సందర్భంగా స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించారు. స్వామి వారిని వెండి కవచ దారణతో అలంకరించారు. హనుమద్ వాహనంపై స్వామిని ఊరేగించారు. ఈ సందర్భంగా మేళతాళాలతో నరసింహస్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. రాజంపేట చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భువనగిరి నరసింహస్వామికొండను, ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలంకరణతో అలంకరించి ప్రత్యేక స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

హంసవాహనంపై వెంకటేశ్వరస్వామి


హంసవాహనంపై ఊరేగుతున్న స్వామి

జమ్మలమడుగు, మే 22: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో నారాపురం వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం మూడవ రోజు ఉదయం 8 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి చిన్నశేషవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. పలువురు భక్తులు పూజలు చేసి మొక్కుకున్నారు. ఉదయం 10.30 గంటలకు స్వామి వారి స్నపన తిరుమంజసం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనారాపురం వెంకటేశ్వరస్వామి ఊంజల్ సేవ పండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు సందర్శించి పూజలు చేసి మొక్కుకున్నారు. అనంతరం రాత్రి 7 గంటలకు అన్నమాచార్య కీర్తనలు, 8 గంటలకు హంసవాహనంపై ఊరేగింపు చేశారు. రాత్రి 9 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా హరికథ నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు జమ్మలమడుగు, మైలవరం మండలం వేపరాల గ్రామానికి చెంది న మహిళా భక్తులు కోలాటం నిర్వహించారు.

కబ్జా కోరల్లో మాండవ్యనది

- ఆక్రమణలతో కుంచించుకుపోతున్న వైనం
- పట్టించుకోని మున్సిపల్, రెవెన్యూ అధికారులు
- నదికి ఇరువైపులా రక్షణ గోడ నిర్మించాలంటున్న స్థానికులు


గాలివీడు రోడ్డులో బ్రిడ్జి వద్ద మాండవ్యనదిని ఆక్రమించి వేసిన రోడ్డు

రాయచోటి టౌన్, మే 22: రాయచోటి పట్టణంలోని పాత రాయచోటిని-రాయచోటి మధ్య ప్రవహిస్తున్న మాండవ్యనది కబ్జాదారుల కబంధహస్తాల్లో చిక్కుకుని రోజురోజుకు కుంచించుకుపోతోంది. నదికి ఇరువైపులా ఆక్రమణలు పెరుగుతుండడంతో రోజు రోజుకు నది విస్తీర్ణం తగ్గిపోతోంది. దక్షిణకాశీగా పిలవబడే భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం నిర్మాణం కాక పూర్వం మాండవ్య మహాముని తపోబలం చేత మాండవ్యనది ఏర్పడిందన్నది ఈ ప్రాంత చరిత్ర, శాసనాల ద్వారా తెలుస్తోంది.

అలాంటి పవిత్రమైన మాండవ్యనది నేడు ఆక్రమణలకు గురి కావడమే కాకుండా మురికినీటికి నిలయంగా మారి కంపుకొడుతోంది. ఒకప్పుడు వీరభద్రస్వామి ఆలయానికి వచ్చే భక్తులు మాండవ్య నదిలో స్నానమాచరించి భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని దర్శించుకునేవారు. అలాంటి నదిపై అటు మున్సిపల్ అధికారులు ఇటు రెవెన్యూ అధికారులు పర్యవేక్షణ చేపట్టకుండా గాలికి వదిలేయడంతో కబ్జాదారులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. పట్టణ పరిధిలోని కంచాలమ్మ గండి చెరువు నుంచి దిగువ అబ్బవరం వరకు మాండవ్యనది పలుచోట్ల కబ్జాకు గురై నది విస్తీర్ణం తగ్గడమే కాకుండా ఇక్కడ మాండవ్యనది ఉందా అన్న అనుమానం కూడా పట్టణ ప్రజల్లో కలుగుతోంది.

ముఖ్యంగా మాండవ్యనదిలో గాలివీడు మార్గంలోని బ్రిడ్జి వద్ద నదిని దర్జాగా ఆక్రమించి కబ్జాదారులు రోడ్డు కూడా వేశారు. అంతేగాక మాసాపేట సమీపంలోని బ్రిడ్జి


మాండవ్య నదిలో ఏర్పాటు చేసిన కోల్డ్ స్టోరేజ్

వద్ద సుమారుగా ఎకరాకు పైగా మాండవ్యనది స్థలాన్ని ఆక్రమించి షెడ్లు వేసి దర్జాగా వ్యాపారాలు సాగిస్తున్నారు. దీనికి తోడు రింగు రోడ్డు సమీపంలోని దిగువ అబ్బవరం- చెన్నముక్కపల్లెకు మధ్యలో గల బ్రిడ్జి వద్ద కొంత మంది కబ్జాదారులు మాండవ్యనదిని ఆక్రమించి చదును చేసి పంటలు సాగు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. అంతేగాక నదికి ఇరువైపులా చాలామంది నది స్థలాన్ని ఆక్రమించి పలుచోట్ల నిర్మాణాలు చేపట్టి నివాసయోగ్యాలుగా వినియోగించుకుంటున్నారు. పూర్వకాలం నుంచి ఒక ప్రత్యేకత సంతరించుకుని అత్యంత పవిత్రంగా ఉన్న మాండవ్య నదిని కబ్జా కోరల నుంచి కాపాడి నదికి ఇరువైపులా రక్షణ గోడ ఏర్పాటు చేసి భవిష్యత్తులో మాండవ్యనది కబ్జాకు గురకాకుండా కాపాడాలని నదీ పరివాహక ప్రాంత ప్రజలతో పాటు రాయచోటి పట్టణ ప్రజలు, కన్నడ భక్తులు కోరుతున్నారు.


పాతరాయచోటి వద్ద మురికినీటితో నిండి ఉన్న మాండవ్యనది

మాండవ్య నదిలో రేకుల షెడ్లు వేసి గోడౌన్లుగా వినియోగిస్తున్న దృశ్యం


వేంపల్లెలో మట్టి తరలింపుపై వివాదం

- మా భూముల్లో నుంచి మట్టి తరలించవద్దు
- లీజు ఉన్న చోటే తీసుకెళ్తున్నాం : వైసీపీ నేతల వాగ్వాదం



మట్టి తరలింపుపై వాదించుకుంటున్న వైసీపీ నేతలు భారతి, ఓబులేసు - మట్టి తరలించడంతో కరిగిపోయిన కొండ

వేంపల్లె, మే 22: వేంపల్లెలో మట్టి తరలింపుపై వివాదం తలెత్తింది. వైసీపీ నాయకుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. మా భూముల్లో మట్టి తోలవద్దంటూ ఎస్సీ కాలనికి చెందిన వైసీపీ నాయకుడు ఓబులేసు మట్టిని తరలించేందుకు వచ్చిన ట్రాక్టర్లను అడ్డుకున్నారు. లీజు ఉన్న చోటనే మట్టిని తరలిస్తున్నామంటూ వైసీపీ నాయకురాలు ఎంపీటీసీ భారతి చెప్పడంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. సీఐ చాంద్‌బాష దృష్టికి సమస్య వెళ్లడంతో మట్టి తరలింపు నిలిపివేయించారు. వేంపల్లెలో బుధవారం జరిగిన ఈ మట్టి తరలింపు వివాదం వివరాలు ఇలా ఉన్నాయి.

స్థానిక వైసీపీ మహిళా నాయకురాలు ఎంపీటీసీ భారతి మట్టి తరలింపునకు లీజు తీసుకుంది. పాములూరు రోడ్డు వైపున మట్టిని తరలించేందుకు జేసీబీ, ట్రాక్టర్లను తీసుకెళ్లింది. దీనిపై ఎస్సీ కాలనీకి చెందిన వైసీపీ నాయకుడు ఓబులేసు మట్టి తరలింపును అడ్డుకున్నారు. మా భూములు ఇవి ఎందుకు మట్టిని తరలిస్తున్నావంటూ అభ్యంతరం తెలిపారు. లీజు ఉన్న చోట మట్టిని తీసుకెళ్తున్నాం. ఎందుకు అడ్డుకున్నావంటూ ఇరువురు వాదోపవాదానికి దిగారు. సమస్య సీఐ చాంద్‌బాష దృష్టికి వెళ్లింది.

వెంటనే మట్టి తరలింపు పనులు నిలిపివేయాలని తహసీల్దార్ వద్ద హద్దులు నిర్ణయించుకున్న తర్వాతే తరలించుకోవాలని సూచించడంతో అక్కడ నుంచి జేసీబీ, ట్రాక్టర్లను వెనక్కి తీసుకెళ్లారు. వేంపల్లెలో మట్టి యథేచ్ఛగా తరలిపోతుందన్న విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఈ వివాదం జరగడం చర్చనీయాంశమైంది. లీజు ఉన్న వారికి హద్దులు గుర్తించి అధికారులు వేయించాలరు. అక్కడ నుంచే నిబంధనల మేరకు మట్టి తరలించేలా అధికారులు తరచూ పర్యవేక్షణ చేస్తే ఇలాంటి వివాదాలను నివారించవచ్చు. ఆ దిశగా రెవిన్యూ, మైనింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మండలాలకు పాఠ్యపుస్తకాల తరలింపు


పాఠ్యపుస్తకాల వాహనాన్ని జెండా ఊపి తరలిస్తున్న డీఈవో అనురాధ

కడప (ఎడ్యుకేషన్), మే 22: ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు మండలాలకు తరలిస్తున్నట్లు డీఈవో అనురాధ పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని బుక్స్ గోడౌన్ నుంచి మండలాలకు బస్సు ద్వారా పాఠ్యపుస్తకాలను తరలించారు. డీఈవో జెండా ఊపి ఆ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాకు సంబంధించి 12,57,465 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా.. మొదటి విడతగా 5,70,953 పాఠ్యపుస్తకాలు వచ్చాయని తెలిపారు. 6,86,512 పాఠ్యపుస్తకాలు ఇంకా రావాల్సి ఉందన్నారు. కడప జిల్లాకు సంబంధించి గోపవరం, బి.కోడూరు, పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.మఠం మండలాలకు 38,842 పాఠ్యపుస్తకాలు పంపించామన్నారు. అన్నమయ్య జిల్లాకు సంబంధించి రాజంపేట, పుల్లంపేట, ఓబులవారిపల్లె మండలాలకు 30,924 పాఠ్యపుస్తకాలు పంపించామన్నారు. బుక్స్ గోడౌన్ మేనేజరు జి.రామాంజులదేవి, డీఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య


ప్రవీణ్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

బ్రహ్మంగారిమఠం, మే 22: వ్యవసాయం చేస్తూ, సరైన వర్షాలు లేక. పంటలు సరిగా పండక, పండినా గిట్టుబాటు ధరల్లేక అప్పుల బాధతో ఓ యువరైతు ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన బి.మఠం మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. బ్రహ్మంగారిమఠం మండలంలోని చౌదరివారిపల్లె ఎస్సీ కాలనీకి చెందిన ఎం.ప్రవీణ్ కుమార్ (34) డిగ్రీ వరకు చదువుకున్నాడు. కొంతకాలం ప్రైవేటు ఉద్యోగం చేశాడు. జీతం సరిపోక పోవడంతో ఆ ఉద్యోగం మానేసి తండ్రితో కలసి వ్యవసాయం చేయడం మొదలు పెట్టాడు. ఈ నేపథ్యంలో కొంతకాలంగా ఐదెకరాలు పొలం కౌలుకు తీసుకుని వరి, మొక్కజొన్న పంటలు సాగుచేశాడు. వర్షాలు సక్రమంగా లేక పంటల దిగుబడి సరిగా లేదు. దీనికి తోడు గిట్టుబాటు ధరలూ లేవు. దీంతో పెట్టిన పెట్టుబడి డబ్బులు కూడా రాక పోవడంతో రూ.6లక్షలకు పైగా అప్పులయ్యాయి. వడ్డీలు పెరుగుతుండటంతో తీర్చేమార్గం లేక మనస్తాపానికి గురైన ప్రవీణ్‌కుమార్ సోమవారం పురుగులమందు తాగి ఇంటికి వచ్చి పడిపోయాడు. గమనించిన భార్య అనిత గ్రామస్థుల సాయంతో హుటాహుటిన ఓ ప్రైవేటు వాహనంలో సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి కడప రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. బుధవారం మృతదేహాన్ని స్వగ్రామం తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి ఒక భార్యతో పాటు మూడుసంవత్సరాలు, సంవత్సరం వయసున్న ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. చిన్నవయసులోనే ఆత్మహత్యకు పాల్పడ్డంతో చౌదరివారిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. అప్పుల బాధతో అకాల మృతిచెందిన ప్రవీణ్‌కుమార్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. మృతుని తండ్రి దేవరాజ్ ఫిర్యాదు మేరకు సిద్దవటం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.


సింహ వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తున్న పెంచలకోన నరసింహస్వామి

నమో.. నారసింహ!

- కొండకోనల్లో మారుమోగిన గోవింద నామస్మరణ
- ఇష్టవాహనంపై ఇలవేల్పు వైభోగం
- వైభవంగా సింహ గరుడవాహన సేవలు

రాపూరు(డక్కిలి), మే 22 : కొండాకోనా ఎటు చూసినా కనుచూపు మేర భక్తులే భక్తులు.... ఎవరినోట విన్నా పెంచలో ...పెంచలా... గోవిందా...గోవిందా... నమో.. లక్ష్మీ నారసింహ... అనే నామ స్మరణే. భక్త కోటి పిలుపుతో పెనుశిల నరసింహుడు పరవశించి పోయాడు. పెంచలకోన బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వర్ణమయ కాంతులతో మెరిసి పోతున్న గరుడ్మంతుడిపై నరసింహస్వామి కొలువుదీరి భక్తులను కటాక్షించాడు. తమ ఇలవేల్పు దివ్యస్వరూపాన్ని తిలకించిన భక్తులు ఆనంద డోలికల్లో మునిగి తేలారు.

● కిక్కిరిసిన కోన

రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలి రావడంతో పెంచలకోన క్షేత్రం కిక్కిరిసిపోయింది. ముందుగా పలువురు భక్తులు తలనీలాలు సమర్పించుకుని, పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు వివిధ సత్రాల్లో అన్నదానం చేశారు. పెద్దసంఖ్యలో జనం తరలి రావడంతో కోనలో ఈ ఏడాది వ్యాపారాలు ఊపందుకొన్నాయి. కాగా పెంచలస్వామి బుధవారం ఉదయం సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అలంకార మండపంలో సింహవాహనాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించి ఉత్సవమూర్తులను కొలువు దీర్చారు. అర్చకుల విశేష పూజల అనంతరం క్షేత్రోత్సవం నిర్వహించారు. అంతకు ముందు ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం,విశేష పూజలు, హోమాలు కొనసాగించారు. రాత్రికి స్వామివారిని తిరుచ్చి వాహనంపై కొలువు దీర్చి సహస్ర దీపాలంకరణ మండపానికి తరలించారు. ఉభయ దేవరులతో కలిపి ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం స్వర్ణ గరుడుడిపై స్వామి వారు కోనలో మూడ వీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమాల్లో ఏసీ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, డీసీ కే విజయసాగర్ సాగరబాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్ హరీష్, ప్రధాన అర్చకులు రామయ్యస్వామి, శశికుమార్‌స్వామి, గుండ్లూరు సీతారామయ్య, పెంచలయ్య, బాలాజీ, మధుస్వామితో పాటు టీటీడీ అర్చకులు పాల్గొన్నారు.

● నేడు కల్యాణం

కోనలో గురువారం ఉదయం శ్రీవారి కల్యాణం వేడుకగా నిర్వహించనున్నారు. ఇందుకుగాను మండపాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. రాత్రి 6 గంటలకు రథోత్సవం, అనంతరం గజవాహన సేవలు నిర్వహిస్తారు.

జగన్ పాలనలో అనారోగ్యశ్రీ

● తులసిరెడ్డి ఎద్దేవా



తులసిరెడ్డి

వేంపల్లె, మే 22: రాష్ట్రంలో నెట్‌వర్క్ ఆసుపత్రులకు ఆ రోగ్య శ్రీ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసి రెడ్డి డిమాండ్ చేశారు. జగన్ పాలనలో ఆరోగ్య శ్రీ కాస్త అనారోగ్యశ్రీగా మారిందన్నారు. బుధవారం ఆయన మీడియాతో మా ట్లాడుతూ ఆరోగ్యశ్రీ కాంగ్రెస్ మానసపథకం అన్నారు. పేదలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి మెరుగైన వైద్యం అందించాలన్న సదుద్దేశంతో 2007లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించిందన్నారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు సకాలంలో ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈ పథకాన్ని విజయవం తంగా అమలు చేశాయన్నారు. ఎంతోమంది రోగులు చావు అంచుకుపోయి పునర్జన్మ సాధించారన్నారు. కానీ దురదృష్టవశాత్తు జగన్ పాలనలో ఆరోగ్యశ్రీ పథకం సరిగ్గా అమలు కావడం లేదన్నారు. గత ఆగస్టు నుంచి బిల్లులు చెల్లించలేదన్నారు. రూ.1500కోట్లు పెండింగ్‌లో ఉండడంతో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేశాయన్నారు. ఈ కారణంగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోయే ప్రమాద ముందన్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరి ష్కరించాలని తులసిరెడ్డి కోరారు.

ఇందిరానగర్‌లో పందులు.. పట్టించుకోని అధికారులు

● పందుల స్వైరవిహారంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

సీకేదిన్నె, మే 22: చింతకొమ్మదిన్నె మండలం మామిళ్లపల్లె పంచాయతీ కార్పొరేషన్‌లో విలీ నమైన ఇందిరానగర్‌లో పందుల బెడద ఎ క్కువ కావడంతో ప్రజలు ఇబ్బందులు పడు తున్నారు. గతంలో పందుల బెడద ఎక్కువ ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన అధికారులు పందులను తొలగిం చినప్పటికి తిరిగి మళ్లీ యథాప్రకారం పం దులు వీధుల్లో యథేచ్ఛగా సంచరిస్తూ వృద్ధు లను, పిల్లలను ఇబ్బందులకు గురిచేస్తున్నా యని ఆందోళన చెందుతున్నారు. పందుల సంచారంతో దుర్గంధం వెదజల్లడంతో పాటు వర్షాకాలం వస్తుండడం తో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయ న్నారు.అధి కారులు చర్యలు తీసుకుని పందుల బెడదను తొలగించాలని, ప్రజల ఇబ్బందులను గమ నించి వాటిని ఊరికి దూరంగా తరలించాలని కోరుతున్నారు.


ఇందిరానగర్‌లో సంచరిస్తున్న పందులు

మళ్లీ మొదలైన పందుల బెడద

ఇందిరానగర్‌లో పందుల బెడద అధికంగా ఉండడంతో గతంలో 'ఆంధ్రజ్యోతి' ద్వారా వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు స్పందించి పందులను తొలగించారు. అనం తరం పట్టించుకునే వారు లేకపోవడంతో పందుల స్వైరవిహారం యధాతధంగా కొనసాగుతోంది. దీంతో ప్రజ లు బెంబేలెత్తుతున్నారు. ఇబ్బందులకు గురిచేయడమేకా కుండా వ్యాధులు ప్రబలడానికి కారణమవుతున్నాయి. వెం టనే అధికారులు స్పందించి పందులను తొలగించాలి.

- ప్రసాద్, ఇందిరానగర్



ఘనంగా కేతు విశ్వనాథరెడ్డి ప్రథమ వర్ధంతి సభ



సంస్మరణ సభలో మాట్లాడుతున్న వక్త

కడప (ఎర్రముక్కపల్లె), మే 22: ప్రసిద్ధ రచయిత, సాహిత్య విమర్శకుడు కేతు విశ్వనాథరెడ్డి ప్రథమ వర్ధంతి సభ బుధవారం సాయంత్రం సింగపూర్ టౌన్‌షిప్ లో ఎస్‌టీఎం టౌన్ షిప్ సోషియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ ఆఫీసు ఆవరణంలో జరిగిన ఈ సంస్మరణ సభకు బండి రాఘవరెడ్డి అధ్యక్షత వహించారు. ప్రధానవక్తగా కథారచయిత పాలగిరి విశ్వప్రసాద్, వక్తలుగా ఎస్‌రెడ్డి, కథారచయిత డాక్టర్ మనోహర్, అసోసియేషన్ కార్యదర్శి గోపిదేశి మధుసూదన్‌రావు పాల్గొన్నారు. పాలగిరి విశ్వప్రసాద్ మాట్లా డుతూ కేతు విశ్వనాథరెడ్డి రచనలు ఎంత గొప్పవో, వ్యక్తిగా ఆయన అంత కన్నా గొప్పవారన్నారు. కేతు విశ్వనాథరెడ్డి కథలన్నింటికీ ప్రాతినిధ్యం వహించే కథ 'నమ్ముకున్న నేల' అని చెబుతూ ఆ కథ అభివృద్ధిలోని డొల్లతనంపై అనేక ప్రశ్నలు లేవనెత్తిందన్నారు. ఎస్.రెడ్డి మాట్లాడుతూ తాను ఈ కాలనీకి రాగానే కేతు విశ్వనా థరెడ్డితో ఎంతో సమయం గడపాలని, ఎన్నో మాట్లాడి తెలుసుకోవాలని అనుకున్నా నని, దురదృష్టవశాత్తు కొద్దిరోజులకే ఆయన దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ 'నమ్ముకున్న నేల' కథను కేతు 1996లో రాస్తే, ఇటీవల అదే కథాంశంతో ఒక మళయాళీ సినిమా వచ్చింద న్నారు. సభా నిర్వాహకులు వై.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేతు కథల కన్నా ఆయన వ్యక్తిత్వం చాలా గొప్పదని కొనియాడారు.

పశుసంవర్ధక శాఖ సహాయకులు

రైతుల మన్ననలను పొందాలి

● జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిణి శారదమ్మ


గుర్తింపు పత్రాలను అందజేస్తున్న జిల్లా అధికారిణి శారదమ్మ

కడప(రూరల్) మే 22 : జిల్లాలోని రైతు భరోసా కేంద్రాలలో పనిచేసే పశు సంవర్ధక శాఖ సహాయ కులు బాధ్యతగా విధు లను నిర్వర్తించి రైతుల మన్ననలను పొందాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారిణి డాక్టర్ సి. శార దమ్మ తెలిపారు. బుధ వారం జిల్లా పశుసంవర్ధ క శాఖ కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ సహా యకులకు శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శారదమ్మ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలలో ఇటీవల ప్రభుత్వం నూతనంగా నియమించిన పశుసంవర్ధక శాఖ సహాయకులకు జిల్లాలోని కడప, పోరుమామిళ్ల, జమ్మలమడుగు, పులివెందులలో ఏ ప్రిల్ 1 నుంచి మే 22 వరకు 45 రోజుల పాటు శిక్షణను ఇచ్చామన్నారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలన్నారు. తమకు అప్పగించిన పనులను తప్ప కుండా సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. రై తులకు ఎల్ల ప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. ఎటువంటి సమయంలో నైనా అత్యవసర కేసులకు హాజరుకావాలన్నారు. మరో రెండు నెలల తరువాత జూన్ 15 నుంచి ఆగస్టు 15 వరకు వారికి దగ్గ రలో ఉన్న వైద్యశాలలో ప్రాక్టీస్ ట్రైనింగ్ ఇస్తామన్నారు. ఉప సంచాలకులు టి.వి. రమణ్య, అధికారులు శ్రీనివాసులరెడ్డి, శ్రీధర్ లింగారెడ్డి, శివరామిరెడ్డి, సురేష్, ఎర్రపురెడ్డి పాల్గొన్నారు.

విషద్రావణం తాగి యువకుడు ఆత్మహత్య

పెండ్లిమర్రి, మే 22: మండలంలోని కొత్తపల్లికి చెందిన బత్తిన శివప్రసాద్‌రెడ్డి (32) బుధవారం రాత్రి విషద్రావణం తాగి ఆ త్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి 108కు సమాచారం ఇవ్వడంతో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొం దుతూ మృతిచెందినట్లు శివప్రసాద్ తల్లిదండ్రులు తెలిపారు. కాగా మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

నేటి నుంచి రేణుకా ఎల్లమ్మ తిరుణాల

సిద్దవటం, మే 22: సిద్దవటం మండలంలోని మాచుపల్లి గ్రామ పంచాయతీలో వెలిసిన రేణుకా ఎల్లమాంబ అమ్మవారి తిరుణాల గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కాగా భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

రామాపురంలో వైభవంగా రెండోరోజు బ్రహ్మోత్సవాలు


హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

కమలాపురం రూరల్, మే 22 : కమలా పురం మండల పరిధిలోని రామాపురం మహాపుణ్యక్షేత్రంలో ముగ్గురు దేవతా మూర్తుల బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. మహాలక్ష్మి సమేత మోక్షనా రాయణ స్వామి శ్రీవల్లి దేవసేన సమేత షణ్ముఖ సుబ్రమణ్యస్వామి సంజీవిని వీరాంజ నేయస్వామివార్లకు బ్రహ్మోత్స వాలు రెండోరోజు వైభవంగా నిర్వహిం చారు. స్వామివార్లకు ఉదయం నుంచి రకరకాల పూజా కార్యక్రమాలు నిర్వ హించారు. సాయంత్రం మోక్ష నారాయణస్వామి శేష వాహనంపై ఊరేగించారు. శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి అశ్వ వాహనంపై ఊరేగించారు. మేళతాళాలు, బాజాభజంత్రీలతో వైభవంగా కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి జయంతి


వల్లూరు: గ్రామోత్సవంలో లక్ష్మీనరసింహ స్వామి

వల్లూరు, మే 22 : లక్ష్మీనరసింహ స్వామి జయంతిని బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి జయంతి సందర్భంగా మం డలంలోని దిగువపల్లె, వల్లూరు తదితర ప్రాంతాల్లో లక్ష్మీనరసిం హస్వామి దేవాలయంలో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఈ సం దర్భంగా మండల కేంద్రమైన వ ల్లూరులో ఉన్న పిచ్చమ్మ సత్రం లో కొలువైన దేవాలయంలో తెల్లవారుజామున నుంచి ప్రత్యేక పూ జలు చేశారు. ఉదయాన్నే పంచామృతాభిషేకం చేశారు. అనంతరం అష్టోత్తర సహస్ర నామావళితో పూజలు చేశారు. రుణ విమోచనకు సంబంధించి ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం వేళ అన్న సంత ర్పణను కార్యనిర్వాహకులు భక్తులకు అందించారు. సాయంత్రం వేళ గ్రామోత్సవం వైభవంగా చేశారు. వల్లూరు నుంచే కాక చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చి భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. వచ్చిన వారికి ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తరించారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనరసింహ స్వామి జయంతి వేడుకలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారి మూలవిరాట్

పెండ్లిమర్రి, మే 22: జిల్లాలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రమై ఐన వెయ్యినూతుల కోన లక్ష్మీనరసింహస్వామి దేవస్థా నంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం లక్ష్మీన్ర సింహస్వామి జయంతి వేడుకలు వైభవంగా జరి గాయి. మండలం నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఆలయ అర్చకులు జయంతి వేడుకల్లో భాగంగా పంచామృతా భిషేకం, వేదపారాయణం, మంగళహారతి నిర్వహిం చారు. రాత్రికి హనుమత్ వాహనంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ఎలాంటటి అసౌ కర్యం కలుగకుండా ఆలయ ధర్మకర్త హరిచంద్రప్ర సాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాతసంగటిపల్లెలో పోలీసుల నాకాబందీ


పాతసంగటిపల్లె గ్రామస్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ, ఎస్‌ఐలు

పెండ్లిమర్రి, మే 22: మండ లంలోని ఫ్యాక్షన్ గ్రామమైన పాతసంగటిపల్లెలో బుధవా రం తెల్లవారుజామున జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు కడప రూరల్ సీఐ నాగరా జు ఆదేశాల మేరకు పెండ్లి మర్రి ఎస్‌ఐ హరిప్రసాద్ కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రాబోయే ఎలక్షన్ కౌంటింగ్ దృష్ట్యా గ్రామంలోని ట్రబు ల్ మాంగర్స్, రౌడీషీటర్లకు హెచ్చరికలు జారీ చేశారు. కౌంటింగ్ రోజు బయటకు రావద్దన్నారు. బయటకు వస్తే ముందస్తు అరెస్టులు ఉంటాయన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విశిష్టమైన కవిత్వాన్ని అందించిన వేటూరి

● ప్రొఫెసరు మూల మల్లిఖార్జునరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), మే 22 : వేటూరి సుందరరామమూర్తి అత్యంత ప్రతిభావంతుడైన కవి అని, తెలుగు సినిమా పాటల ద్వారా ఆయన విశిష్టమైన కవిత్వాన్ని అందించారని ప్రొఫెసరు మూల మల్లిఖార్జునరెడ్డి కొనియా డా రు. బుధవారం వేటూ రి వర్ధంతిని పురస్కరించుకుని కడప నగరం రాజీవ్ క ల్చరల్ క్లబ్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కె.విశ్వనాథ్ దర్శకత్వంలో ఓ సీత కథ ద్వారా సిని మా రంగానికి వేటూరి పరిచయమై వేలాది పాటలు రాసి గొప్ప కీర్తిని ఆర్జించారన్నారు. అనం తరం డాక్టర్ వెల్లాల వెంకటేశ్వర ఆచారి మాట్లాడారు.

దివ్యాంగ పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించండి


దివ్యాంగ పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించాలని కోరుతున్న ఐఈఆర్టీలు

వేంపల్లె, మే 22: దివ్యాంగ పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించాలని ఎంఈఓ జాఫర్ సాదిక్ కోరారు. బుధ వారం వేంపల్లెలో ఐఈఆ ర్టీలు యశోద, సుజాతలు ఇంటింటికి వెళ్లి సర్వే కార్య క్రమం నిర్వహించారు. 40 రోజుల పాటు ఈ సర్వే కొన సాగుతుందని ఎంఈఓ తెలి పారు. సమగ్ర శిక్ష ద్వారా అందుతున్న సౌకర్యాలు ది వ్యాంగ చిన్నారులకు ఎస్కార్ట్, ట్రాన్స్‌పోర్ట్, స్టైఫండ్ అలవెన్సులు, కావాల్సిన ఉపకరణాలు, ఉచిత వైద్య శిబిరాలు, ప్రతిసోమవారం ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలియజేయడం జరుగుతోందన్నారు. భవిత కేంద్రం ద్వారా దివ్యాంగ చిన్నారులు పదవ తరగతి, ఇంటర్‌మీడియట్ కూడా ఉత్తీర్ణులై ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 స్టాలిన్ ఐజాక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో గ్రూప్-2 స్టడీ మెటీరియల్ పంపిణీ


మెటీరియల్‌ను అందిస్తున్న ఏబీవీపీ నాయకులు

కడప (ఎర్రముక్కపల్లె), మే 22 : గ్రూప్-1, 2 పరీక్షలకు సిద్ధమవుతున్నవిద్యార్థులకు గ్రూప్-2 స్టడీ మెటీరియల్‌ను ఏబీవీపీ ఆధ్వర్యంలో పంపిణీ చేసినట్లు ఏబీవీపీ ప్రతినిధు లు తెలిపారు. బుధవారం క డప నగరం శివసాయి అకా డమీలో మెటీరియల్‌ను పం పిణీ చేశారు. ఈ కార్యక్రమా నికి హాజరైన కరస్పాండెంట్ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవా లన్నారు. ఏబీవీపీ, శివసాయి అకాడమీ ద్వారా మెటీరియల్‌ను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు కోడూరు మల్లిఖార్జున, రాజు, హరి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మండలానికి 250 క్వింటాళ్ల వేరుశనగలు మంజూరు

● నేటి నుంచి నమోదు

వీరపునాయునిపల్లె, మే 22:మండలానికి వేరుశనగ విత్తనకాయలు 250 క్వింటాళ్లు మంజూరయ్యాయని మండల వ్యవసాయాధికారి శ్యామ్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం నుంచి విత్తన నమోదు కార్యక్రమం ఉంటుం దని, 40శాతం సబ్సిడీతో అందిస్తామని తెలిపారు.

కావాల్సిన రైతులు ఆర్బీకేలను సంప్రదించి పట్టాదారు బుక్కు, ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ తీసుకెళ్లి బయోమెట్రిక్ ద్వారా వేరుశనగ విత్తనాలు పొందాలని తెలి పారు. కే6 మరియు టీసీజీఎస్ 1694 రకాలు క్వింటాల్ రూ.9500 కాగా సబ్సిడీ పోను రైతు రూ.5700 చెల్లించాలన్నారు. అలాగే కదిరి లేపాక్షి రకం క్వింటాల్ ధర రూ.8700 కాగా సబ్సిడీ పోను రైతు వాటా రూ.5220 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యాదీవెన డబ్బు పూర్తిస్థాయిలో

విడుదల చేయాలి: టీఎన్‌ఎస్‌ఎఫ్




మాట్లాడుతున్న బొజ్జ తిరుమలేశ్

కడప (ఎర్రముక్కపల్లె), మే 22 : ముఖ్యమంత్రి బటన్ నొక్కి దా దాపు మూడు నెలలు కావస్తు న్నా జగనన్న విద్యాదీవెన డబ్బు అందక పలువురు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తక్ష ణం డబ్బు విడుదల చేయాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్ డిమాండ్‌చే శారు. బుధవారం కడప నగరం టీఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్నవిద్యాదీవెన ఆర్భాటంగా ప్రవేశపెట్టినప్పటికీ ఆ పథకం ఐదేళ్లలో ఏ ఒక్క విద్యార్థికీ పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించలేదన్నారు. ఈ సంవత్సరం మార్చి 1న క్రిష్ణా జిల్లా పాలమూరులో సీఎం జగన్ ఆర్భాటంగా జగనన్న విద్యాదీఎనకర సంబంధించి బటన్ నొక్కారన్నారు. అయితే బటన్ నొక్కి మూడేళ్లు కావస్తున్నా కొంత మం దికి మాత్రమే నిధులు అందాయని తెలిపారు. అధిక మొత్తంలో డిగ్రీ, ఇంజనీరింగ్ నర్సింగ చదువుతున్న విద్యార్థులకు అందలేదన్నారు. కళాశాల యాజ మాన్యాల నుంచి ఫీజు చెల్లించాలని వత్తిళ్లు అధికమై విద్యార్థులు తీవ్ర ఇబ్బందు లకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి విద్యాదీవెన కు సంబంధించిన నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ఏటూరి లోకేశ్, శివ పాల్గొన్నారు.

నేరచరిత్ర కలిగిన వ్యక్తులపై నిఘా

కొత్త వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి: సీఐ



గ్రామంలో ఇళ్ల పరిసరాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు.. వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో సూచనలిస్తున్న సీఐ చాంద్‌బాషా

వేంపల్లె, మే 22: రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తు లపై నిఘా ఉంచినట్లు వేంపల్లె సీఐ చాంద్‌బాష హెచ్చ రించారు. బుధవారం రామిరెడ్డిపల్లె, కత్తులూరు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి తనిఖీ చేశారు. ప్రజల భద్రత కోసమే సమస్యాత్మక గ్రామాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించా మన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాల విడుదల సందర్భంగా గ్రామాలలో ఎటువంటి అల్లర్లు, హింసాత్మక ఘటనలు చోటుచేసుకో కుండా ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే గ్రామాల్లో ఉన్న సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎవ రైనా కొత్త వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వా లని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ప్రవీణ్‌కు మార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

జమ్మలమడుగు, మే 22: డిపో కార్యాలయంలో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ప్రవీణ్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ప్రజల సమస్యలు, సలహాలు తీసుకోబడుతాయన్నారు. ఆయా గ్రామాల్లో కానీ, పట్టణంలోకానీ ఆర్టీసీ సమస్యలపై 9959225778 నంబరుకు ఫోన్ చేసి తెలుపగలరు.

దివ్యాంగుల సమగ్ర సర్వే

జమ్మలమడుగు, మే 22: జమ్మలమడుగు మండలంలోని రెండు రోజులుగా దివ్యాంగ పిల్లల నమోదు, సర్వే కార్యక్రమం జరుగుతోంది. బుధవారం మండలంలోని సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు చంద్రమోహన్, హనుమత్‌గిరి కొత్తరోడ్డు, అంబవరం, రాజీవ్‌నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో సర్వే నిర్వహించారు. 1 నుంచి 18 సంవత్సరాలలోపు దివ్యాంగ పిల్లలను గుర్తించాలని, గుర్తించినవారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమం జూన్ 9వ తేదీ వరకు కొనసాగుతుందని ఎవవరైనా దివ్యాంగ పిల్లలను తమ పాఠశాల వద్దకు తెచ్చి పేరు నమోదు చేయించుకోవాలన్నారు. లేకపోతే సమాచారం తెలిపినా తామే వచ్చి గుర్తిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అర్చన పాల్గొన్నారు.

కాశినాయన..: మండలంలో ప్రత్యేక అవసరాలుగల పిల్లల గుర్తింపుపై ఎంఈవో ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష సహకారంతో సర్వే కార్యక్రమం చేపట్టినట్లు ఈఈ ఆర్‌పీలు శ్రీనివాసులరెడ్డి,నరేష్ తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర విద్యార్థులవలే మంచి భవిష్యత్ అందించాలనే ఉద్దేశ్యంతో ఈసర్వే సాగుతుందన్నారు. ప్రతి బుధవారం ఫిజియోథెరపీ చేయించడం లాంటి కార్యక్రమాల తోపాటు అవసరమైన పరికరాలను అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈకార్యక్రమం చేపట్టిందన్నారు. ఇందుకు తల్లిదండ్రులు సహకరించాలని వారుకోరారు.

వినియోగదారులకు బయోమెట్రిక్ తప్పనిసరి

మైలవరం, మే 22 : జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలోని భారత్ గ్యాస్ వినియోగ దారులు తప్పనిసరిగా గ్యాస్ పుస్తకానికి ఆధార్ బయోమెట్రిక్‌ను అనుసంధానం చేసుకోవాలని జమ్మలమడుగు పట్టణంలోని భారత్ గ్యాస్ నిర్వాహకులు స్వామి బుధవారం తెలిపారు. మండల పరిధిలోని వద్దిరాల గ్రామంలో ఆయన మాట్లాడుతూ చాలా మంది వినియోగదారులు ఆధార్ అను సంధానం చేసుకున్నారని ఇంకా కొద్ది మంది మాత్రమే చేసుకోలేదని వారు ఈ నెల 30వ తేదీ సాయంత్రంలోపు అనుసంధానం చేసుకోవాలని కోరారు.ఏమైనా సందేహాలకు జమ్మలమడుగులోని బారత్ గ్యాస్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మోటారు బైకులు ఢీ

ఇద్దరికి గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేశ్

పోరుమామిళ్ల, మే 22 : పోరుమామిళ్ల సమీపంలో బద్వేలుకు వెళ్లే దారిలో స్కూటరు - మోటరు బైకు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. మహబూబ్‌నగర్‌కాలనీకి చెందిన షంషాద్‌బాషా స్కూటీలో వెళుతుండగా ఉదయగిరి మండలం మాసాపేటకు చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి తన బంధువుల దగ్గరికి సొంత పనుల అవసరం నిమిత్తం పోరుమామిళ్ల వస్తుండగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ సమయంలో అటుగా వస్తున్న ఫారెస్టు రేంజర్ రఘునాథరెడ్డి క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. షంషాద్‌బాషాకు గాయాలు తీవ్రం కావడంతో వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు. ఈ సంఘటనలో వెంకటేశ్‌కు కూడా గాయాలయ్యాయి.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు : డీఎస్పీ

జమ్మలమడుగు, మే 22: సార్వత్రిక ఎన్నికలు 2024 కౌంటింగ్ నేపథ్యంలో జమ్మలమడుగు నియోజకవర్గంలో ఎక్కడైనా సమస్యలు తలెత్తితో కఠిన చర్యలు తీసుకుంటామని జమ్మలమడుగు పోలీసు అధికారులు హెచ్చరించారు. బుధవారం జమ్మలమడుగు పాత బస్టాండు గాంధీ విగ్రహం వద్ద ప్రొబేషనరి డీఎస్పీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు సిబ్బంది మాబ్ ఆపరేషన్ మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా, హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నా, ఎవరైనా అల్లర్లు చేస్తున్న సమయాల్లో పోలీసులు ఎలా స్పందించాలి, నియంత్రణ చేసేందుకు మొదటగా వార్నింగ్ ఇవ్వటం, తదితర అంశాలపై పోలీసులకు తెలియజేశారు. చివరగా అధికారులతో అనుమతులు తీసుకుని అలాంటి ఘటనా ప్రదేశాల్లో టియర్‌గ్యాస్ ప్రయోగించుట, ఉద్రిక్తత పరిస్థితుల్లో తనను తాను రక్షించుకుంటూ లాఠీచార్జి, ఆ తర్వాత ఫైర్ డిపార్టుమెంట్‌వారితో వాటర్ ప్రయోగించుట. అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోతే ఫైరింగ్ చేయటం వంటివి డెమో ద్వారా ప్రదర్శించారు. సీఐలు కరుణాకర్, గోపాల్‌రెడ్డి, ఎస్‌లు సుబ్బారావు, ఆర్‌ఐ ఆనంద్, ఆర్మ్‌డ్ సిబ్బంది పాల్గొన్నారు.

జూన్ 6 వరకు పోలీస్ 30 యాక్ట్ అమలు

మైదుకూరు, మే 22 :సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యేవరకు ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతి లేదని, జూన్ 6వ తేదీ వరకు 144. 30 సెక్షన్లు అమలు ఉంటాయని డీఎస్పీ టీ వెంకటేసులు తెలిపారు. స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్ కార్యాలయం ఆవరణలో బుధశారం ఆయన వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. జూన్ 4న కౌంటింగ్ ముగిసినా జూన్ 6వ తేదీ వరకు పోలీస్ 30 యాక్ట్‌తో పాటు 144వ సెక్షన్లు అమలులో ఉంటాయన్నారు. అంత వరకు ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీలు, నలుగురు మించి గుంపులు కూడటం చేయకూడదన్నారు. రాత్రి 9 గంటలకు వివిధ వ్యాపార సంస్థలన్నింటినీ మూసివేయాలని తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు బయట తిరగకుండా తమ ఇళ్లల్లోనే ఉండాలని సూచించారు. అలాగే అసాంఘీక శక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఏమైన సమాచారం తెలిసిన వెంటనే పోలీసుల దృష్టికి తీసుకరావాలని కోరారు. ఉల్లఘంనలు అతిక్రమిస్తే ఎంతటివారి పైననూ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో సీఐ ఏపీ మస్తాన్, ఎస్‌ఐ ఘన మద్దిలేటి పాల్గొన్నారు.





జమ్మలమడుగు పాత బస్టాండులో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది, బద్వేలు... గ్రామంలో పోలీసు కవాతు నిర్వహిస్తున్న రూరల్ ఎస్‌ఐ, అట్లూరు ఎస్‌ఐలు

బద్వేలు రూరల్..: మండల పరిధిలోని ఉప్పత్తివారిపల్లె, అట్లూరు మండల పరిధిలోని కమల కూరు గ్రామాల్లో రూరల్ ఎస్‌ఐ రవికుమార్, అట్లూరు ఎస్‌ఐ కేసీ రాజులు బుధవారం పోలీసు సిబ్బందితో కలిసి కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆయుధాలు ఏమైనా దాచి ఉంచారేమోనని తనిఖీలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు దృష్టిలో ఉంచుకుని ప్రజలందరూ శాంతియుతంగా ఉండాలని, ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తే చర్యలు తీసుకుంటా మన్నారు. ఎలక్షన్ నియమాలను ప్రతిఒక్కరూ పాటించాలని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకంటామన్నారు. కార్యక్రమంలో అట్లూరు, బద్వేలు రూరల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: ఎన్నికల ఫలితాల సందర్భంగా గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంత టివారినైనా ఉపేక్షించేది లేదని సీఐ మల్లికార్జునరెడ్డి హెచ్చరికలు జారీ చేశారు. బుధవారం పోరుమామిళ్ల పోలీసుస్టేషన్ ఆవరణంలో మండల పరిధిలో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సందర్భంగా గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించరాదన్నారు. అంతేకాక గెలుపు అనంతరం బాణసంచా పేల్చడం కానీ, ర్యాలీలు నిర్వహిం చరాదన్నారు.ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

రాజుపాలెం..: మండల పరిధిలోని వెలవలి గ్రామంలో రాజుపాలెం ఎస్‌ఐ తులసి నాగ ప్రసాద్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు చేశారు. ఎవరైనా మారణాయుధాలు కలిగి ఉంటే కేసులునమోదు చేస్తామన్నారు. గ్రామంలోని గడ్డివాములు, బయటి ప్రదేశం అన్ని రాజకీయ పార్టీల నాయకుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. ఓట్ల లెక్కింపు జరిగేంత వరకు ఎన్నికల నియమావళి ఉన్నందున గొడవలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ సిద్దయ్య, పోలీసు బృందం పాల్గొన్నారు.

ఖాజీపేట..: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే జైలుపాలు కాక తప్పదని సీఐ రామాంజులు అన్నారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో అన్ని పార్టీల వారికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6 తేదీ వరకు ఎన్నికల నియమావళి ఉంటుందని, ఎక్కడా రోడ్లపై నలుగురికి మించి ఉండరాదన్నారు. బస్టాండు కూడలిలో గుమికూడి అనవసరపు మాట్లాడి ఘర్షణలకు పాల్పడితే జైలుపాలుకాక తప్పదన్నారు. 4వ తేదీ కౌంటింగ్‌ను పురస్కరించుకుని బస్టాండు కూడలిలో టపాసులు పేల్చరాదని, పని నిమిత్తం బయటికి రావాలి తప్ప అనవసరంగా బస్టాండుకు రాకూడదన్నారు.



రాజుపాలెంలో పోలీసు తనిఖీలు

ఇష్టానుసారంగా మద్యం అమ్మకాలు

● స్థానికులకు ఇబ్బందులు ● పట్టించుకోని అధికారులు

ఖాజీపేట, మే 22: ఖాజీపేట మండల పరిధిలోని మద్యం షాపుల్లో ఇష్టానుసారంగా అమ్మకాలు జరుపుతున్నారు. తెలిసినవారైతే వారు కోరుకున్న బ్రాండ్ అందజేస్తారు. తెలియని వారైతే కోపగించుకోవడం, చీప్ మందు ఇవ్వడం జరుగుతోంది. అధికారులు మాత్రం అటువైపు తొంగిచూడకపోవడం విశేషం. మద్యం సేవించి బస్టాండు కూడలిలోని గాంధీ విగ్రహం వద్ద పడిపోవడంతో అటువైపు ప్రయాణించే ప్రయాణికులు ఇంత విచ్చలవిడిగా తాగి పడిపోతుంటే అధికారుల పనితీరు ఇట్టే అర్థమవుతుందని ప్రజలు గుసగుసలాడుతున్నారు. వైన్‌షాపు పక్కన మద్యం తాగకూడదన్న నిబంధనలకు విరుద్ధంగా పక్కనే మద్యం తాగడానికి మందుబాబులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. మద్యం తాగి చుట్టుపక్కలవారికి ఇబ్బందులు పెడుతున్నారని పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించకపోతే చుట్టుపక్కలవారికి ఇబ్బందులు తప్పవని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వైన్‌షాపు పక్కనే మద్యం తాగుతున్న మందుబాబులు

● **ట్రాఫిక్‌కు అంతరాయం..:** బస్టాండు కూడలికి సమీపంలో వైన్‌షాపు ఉండడంతో మద్యంప్రియులు ఇష్టానుసారంగా రోడ్లపై స్కూటర్లు పెట్టి వెళ్లడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రొద్దుటూరు టౌన్, మే 22: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరచిన తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు తొగటవీర క్షత్రియ ఉద్యోగులు, వృత్తినిపుణుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఈడెం లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని మున్సిపల్, జడ్పీ, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలో మంచి మార్కులు సాధించిన తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తామన్నారు. ప్రథమ బహుమతి రూ5 వేలు, ద్వితీయ, రూ. 3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు అందజేస్తామన్నారు. జూన్ 2వ తేదీలోపు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు వసంతపేటలోని సంఘం కార్యాలయంలో సంప్రదించాలన్నారు. జూన్ 9వ తేదీ ప్రతిభా పురస్కారాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రామమునెయ్య, శ్రీనివాసులు, శివనాగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి జయంతి



నరసింహస్వామి జయంతి సందర్భంగా స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం

రాజుపాలెం, మే 22 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన వెల్లాల సంజీవరాయ చెన్నకేశవ స్వామి ఆవరణలో పురాతన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బుధవారం నరసింహస్వామి జయంతి ఉత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి,అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం లక్ష్మీదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఉత్సవవిగ్రహాలను పల్లకీలో కూర్చోబెట్టి గ్రామోత్సవం నిర్వహించారు. చెన్నకేశవ సంజీవరాయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చెన్నకేశవస్వామి పల్లకీసేవ చేశారు. రాత్రి హనుమద్ వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ జగదీశ్వర్ రెడ్డి, ఈవో బీవీ నరసయ్య పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: రూరల్ పరిధిలోని నరసింహాపురంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామున స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, లక్ష్మీనరసింహ, సుదర్శన హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మండపంలో లక్ష్మీనరసింహస్వామిని కొలువుదీర్చి సుముహూర్తంలో స్వామివారి కల్యాణంను కన్నులపండువగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.



లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

బాలసాహిత్యం ద్వారా విజ్ఞానం పెంచుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, మే 22: బాలసాహిత్యం ద్వారా విద్యార్థులు విజ్ఞానం పెంచుకోవచ్చునని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీకే చదువులబాబు పేర్కొన్నారు. బుధవారం గ్రేడ్-1 గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ తిరుపతమ్మ, నాగలక్ష్మీదేవి, చాడా మునిశేఖర్‌రెడ్డి, పవన్‌కల్యాణ్, చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రోమోర్ రైతుల సంబరాలు



రైతులకు టీవీఎస్ మోపెడ్ బండ్లు అందిస్తున్న దృశ్యం

రాజుపాలెం, మే 22 : మండల పరిధిలోని కొరపాడు గ్రామంలో బుధవారం కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వారి గ్రోమోర్ రైతు సంబరాలను నిర్వహించారు. గ్రోమోర్ సెంటరులో ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు డ్రా పద్ధతిలో ముగ్గురిని విజేతలుగా గుర్తించారు. వారికి టీవీఎస్ మోపెడ్ బండ్లను బహుమతిగా అందించారు. జోనల్ మేనేజరు ఎల్‌వీ రమణారెడ్డి, మార్కెటింగ్ ఆఫీసర్లు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా రాజారామ్మోహన్‌రాయ్ జయంతి

ప్రొద్దుటూరు టౌన్, మే 22: సంఘసంస్కర్త రాజారామ్మోహన్‌రాయ్ జయంతిని పురస్కరించుకుని బుధవారం జేవీవీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రచయిత జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాజారామ్మోహన్‌రాయ్ విగ్రహారాధనను, సతీసహగమనాన్ని, బాల్యవివాహాలను తీవ్రంగా వ్యతిరేకించారన్నారు.ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు తవ్వా సురేష్, జిల్లా అధ్యక్షులు శ్రీరాములు, రాజశేఖర్‌రెడ్డి, అల్లాబకాష్, అక్షయ, హాసిని, తేజ, భరత్, పాల్గొన్నారు.

ఘనంగా నల్లగొండ లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవాలు

బి.కోడూరు, మే 22 : మండల పరిధిలోని బద్వేలు, పోరుమామిళ్ల మెయిన్‌రోడ్డు ఎర్రిఓబన్నబావికి సమీపాన కొండ దడిన వెలసిన నల్లగొండ లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలు సోమవారం నుంచి నిర్వహించగా, ముగింపు బుధవారం రోజున బి.కోడూరు, రామసముద్రం, ఆనంవారిపల్లె, గుంతపల్లె, పాయలకుంట్ల, మరాటిపల్లె, పాపనపల్లె, రెడ్డివారిపల్లె, మాధవరాయునిపల్లె గ్రామాల మహిళలు హరిభజనలు నిర్వహించారు. క్రిష్ణంపల్లె గ్రామానికి చెందిన వారు బుధవారం రాత్రికి కోదండరామస్వామి, గొడ్లవీడు, మాధవరాయునిపల్లె , పాయలకుంట్ల గ్రామ కోలాట బృందాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.



వైభవంగా ఉరుసు

జమ్మలమడుగు, మే 22: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో పలగాడి వీధిలో వెలసిన తూగుట్లపల్లె జాగీర్దార్ హజరత్ సయ్యద్‌షా బడేగౌస్‌పీరాఖాద్రీ ఉరుసు ఉత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దర్గాలో బుధవారం రాత్రి జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం, ప్రొద్దుటూరు తదితర మండలాల భక్తులు సందర్శించి ప్రత్యేక ఫాతెహాలు చేసి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి గౌస్‌పీరాఖాద్రీ, యువపీఠాధిపతి తాహీర్‌పీరాఖాద్రీ దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు చేశారు. అనంతరం దర్గా ప్రాంగణంలో ప్రసాదం అందించారు. గౌషియా షాదీఖానాలో రాత్రి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఉరుసులో ఫాతెహా చేస్తున్న పీఠాధిపతి

14 టేబుళ్ళు 20 రౌండ్లల్లో ఓట్ల లెక్కింపు

మైదుకూరు, మే 22 : కడపలోని మౌలానా అజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలోని పాలిటెక్నిక్ కళాశాలలో జూన్ 4న ఓట్లు లెక్కింపు ఉంటుందని రిటర్నింగ్ అధికారి చంద్రమోహన్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మొదట పోస్టల్ బ్యాలెట్లు లెక్కింపు తరువాత ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 269 కేంద్రాల్లో పోలింగ్ జరిగిందని, పోలింగ్ ఏజెంట్లు, అధికారుల సమక్షంలో 14 టేబుళ్ళు ఏర్పాటు చేసి మొత్తం 20 రౌండ్లల్లో లెక్కింపు ఉంటుందని ఆయన తెలిపారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి

కాశినాయన మే22: వేసవిలో మండల వ్యాప్తంగా తాగునీటి సమస్యలు తలెత్తకుండా సిబ్బంది ముందస్తుచర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ముధసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నర్సాపురం వెలుగు కార్యాలయంలో మండల ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్యఆచారి అధ్యక్షతన సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈసమవేశంలో పలువురు అధికారులు తమ తమ శాఖల విషయాలపై, అభివృద్ధి కార్యక్రమాలపై సభలో వినిపించారు. ఈకార్యక్రమంలో తహసీల్దారు కృష్ణ, పీఆర్ ఏఈ పుల్లయ్య, హౌసింగ్ ఏఈ బాలిరెడ్డి,ట్రాన్స్‌కో ఏఈ రమేష్‌బాబు,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పశువైద్యుడు రామారావు అధికారులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా సీతారాముల కల్యాణం

బద్వేలు టౌన్, మే 22 : మున్సిపాలిటీపరిధిలోని మైదుకూరురోడ్డు కుమ్మరికొట్టాలలోని రామాలయంలో ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సీతారాముల కళ్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. బుధవారం వేకువ జామునుంచే సీతారాములస్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి వారు ఉత్సవవిగ్రహాలకు వేదమంత్రాలతో పచ్చని తోరణాల మధ్య మంగళవాయిద్యాలతో సీతారాముల కళ్యాణాన్ని వేదపండితులు కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయకమిటీవారు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం వెంబడి కోలాట ప్రదర్శన అందరినీ ఆకర్షించింది.





ప్రత్యేక అలంకరణలో సీతారాములస్వామి మూలవిరాట్ విగ్రహాలు, గ్రామోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా కోలాటం

మైనారిటీలకు శ్మశానస్థలం కేటాయించాలని ఆందోళన

కొండాపురం, మే 22: సుగుమంచిపల్లె పునరావాస కాలనీలో మైనారిటీలకు శ్మశానస్థలం కేటాయించాలని బుధవారం ముస్లిం మైనారిటీలు ఆందోళన కు దిగారు. దత్తాపురం గ్రామానికి చెందిన అబీద అనే మహిళ బుధవారం మృతిచెందింది. ముస్లిం మైనారిటీలుకు శ్మశానవాటిక ఏర్పాటు చేయకపోవడంతో ఆమెను ఎక్కడ ఖననం చేయాలని పలువురు ముస్లిం మైనారిటీలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో త్వరలో పరిష్కారం చూపుతామని రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చినట్లు మైనారిటీలు తెలిపారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం